క్లుప్తంగా

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, నియోజకవర్గ ఎన్నికల ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎ.శ్రీనివాసరావు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులు, రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫారాల వేగంగా పరిష్కరించాలన్నారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడంలో పార్టీల నాయకులు అసిస్టెంట్ బీఎల్‌ఓల ద్వారా బీఎల్‌ఓలకు సహకరించాలన్నారు. ఓటరు జాబితాపై అనుమానలుంటే నేరుగా అసిస్టెంట్ ఎన్నికల అధికారుల దృష్టికి తేవాలని ఎన్నికల అధికారి శ్రీనివాసరావు కోరారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, ఎన్నికల డీటీ టి.శ్రీనివాసరావు, మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వివిధ పార్టీల నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, ధరణాలకోట శ్రీను, కొండపల్లి శ్రీనివాసు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కూడా పాఠశాలలకు సెలవు

ప్రత్తిపాడు: మిచాంగ్ తుపాన్ వల్ల విరామం లేకుండా వర్షం కురుస్తుండడంతో ప్రత్తిపాడు మండలంలోని పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించారు. తుపాన్ కొనసాగడంతో జిల్లా విద్యాశాఖాధికారి సూచన మేరకు మూడో రోజు బుధవారం కూడా మండలంలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు.

షెడ్డు కూలి ఇద్దరు మహిళలకు గాయాలు



గాయపడిన ఆదిలక్ష్మి, గుర్రమ్మ లను తుని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేసిన దృశ్యం

అన్నవరం: అన్నవరం దేవస్థానంలో మంగళవారం సాయంత్రం సుడిగాలి సృష్టించిన బీభత్సానికి షెడ్డు కూలి ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన ఆదిలక్ష్మి, సత్తెనపల్లికి చెందిన గుర్రమ్మ సత్యదేవుని దర్శనానికి వచ్చారు. కల్యాణ మండపం వద్ద చిన్న షెడ్డు వద్ద సేద తీరుతుండగా సుడిగాలికి షెడ్డు కూలిపోయింది. షెడ్డు రేకులు వేగంగా వారి మీదకు దూసుకురావడంతో ఆదిలక్ష్మి చేతి వేళ్లు చితికిపోయాయి. గుర్రమ్మ కాలికి గాయాలయ్యాయి. దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ ను వెంటనే స్పందించి వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. సుడిగాలి భీబత్సానికి దేవస్థానం ఘాట్‌రోడ్‌లో వృక్షాలు నేల కూలాయి.

రేషన్ షాపులపై దాడులు

సామర్లకోట: పట్టణంలోని రేషన్ షాపులపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం దాడులు జరిపారు. స్థానిక ఉప్పువారి వీధి, కుమ్మర వీధుల్లో ఉన్న రేషన్ షాపుల్లో సరకులను అక్రమంగా తరలిస్తున్నారనే ఫిర్యాదుల మేరకు ఈ దాడులు నిర్వహించారు. ఆయా షాపుల్లో సరకుల నిల్వలో తేడాలు ఉండటంతో, రెండు షాపులను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు వారిపై 6ఏ కేసు నమోదు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సిఫార్సు చేశారు.

పంచారామ క్షేత్రంలో కొనసాగుతున్న పూజలు

సామర్లకోట: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో 22వ రోజు మంగళవారం ప్రత్యేక పూజలు కొనసాగించారు. తెల్లవారుజామున గోపూజతో పూజలు ప్రారంభించారు. స్వామివారికి అభిషేకాలు, పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి ఆలయం ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేసి, వెలిగించారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పారిశ్రామిక వేత్త అబంటి సుబ్రహ్మణ్యం, అడబాల కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు. ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది.



గోకవరం మండలం గంగంపాలెంలో నేలకొరిగిన వరి పంట



జి.కొత్తపల్లిలో పనలపై ఉన్న వరి పంట



తొండంగిలో పంటలను పరిశీలించిన తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఏఓ నరసింహం తదితరులు



తేటగుంటలో ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న హెచ్‌ఓ విజయలక్ష్మి



బొద్దవరంలో నేలకొరిగిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏఓ చంద్రశేఖర్

విస్తారంగా వర్షాలు

- మిచాంగ్ తుపానుతో ఎడతెరిపిలేని వర్షాలు
- స్తంభించిన జనజీవనం
- నీట మునిగిన వరి పంటలు
- అప్రమత్తమైన అధికారులు

ఏలేశ్వరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో వర్షాలు విస్తారంగా వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా ఓ మోస్తారు నుంచి భారీగా వర్షాలు పడ్డాయి. జన జీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. ప్రజలు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడ్డారు. పంట పొలాలు నీట మునిగాయి. ముందస్తుగా తుపానుపై రైతులను వ్యవసాయశాఖ అధికారులు అప్రమత్తం చేయడంతో ముప్పు తప్పింది. మండల వ్యసాయాధికారి బి.జ్యోతి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. మండలంలోని లింగంపర్తి, యర్రవరం, భద్రవరం, పేరవరం, ఏలేశ్వరం, సిరిపురం తదితర గ్రామాల్లో పర్యటించారు.

ప్రత్తిపాడు: మండలంలో సోమవారం ఉదయం నుంచీ వర్షం మొదలైంది. ఓ మోస్తరు నుంచి అధికంగానే కురిసింది. మంగళవారం ఉదయం 28 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ఉదయం తేలికపాటి జల్లులు, చలి గాలులతో ప్రారంభమై సాయంత్రానికి ఈదురు గాలులు జోరందుకున్నాయి. ప్రజలు చలి గాలులకు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రత్తిపాడు, రాచపల్లి, పెద శంకర్లపూడి తదితర గ్రామాల్లో కోతలు పూర్తి చేసి, పనలపై ఉన్న పంట తడిసిముద్దయ్యింది. నీట మునిగిన వరి పంట పొలాలను తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ పరిశీలించారు.

రౌతులపూడి: మండలంలోని బలరామపురం, ములగపూడి గ్రామాల్లో పంట పొలాలను వ్యవసాయాధికారి రెడ్డి ఈశ్వరరావు పరిశీలించారు. రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కోతకోసిన పంటలు నీట మునిగితే 5 శాతం ఉప్పునీటిని పనలపై పిచికారీ చేయాలని సూచించారు. గింజలు రంగు మారకుండా ఉండడానికి ఒక గ్రాము కార్బండజిమ్, లేదా యాంకోజెట్ ఒక మిల్లీలీటరు ప్రాపికొనజోల్ మందును పిచికారీ చేయాలని అన్నారు.

శంఖవరం: తుపానుతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా 3 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు.సుమారు 1000 ఎకరాల్లో కోత కోయడంతో మిగిలిన పంట పనలపై ఉంది. ఈదురు గాలులకు అక్కడకక్కడ పంట నేల కొరిగింది. నష్టం కలుగుతుందని ఆందోళన చెందుతున్నారు. అరటి తోటల రైతులు బిక్కుబిక్కుమంటున్నారు.

ఉద్యాన పంటలకు సస్యరక్షణ చర్యలు అవసరం

తుని రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో నష్టం వాటిల్లకుండా ఉద్యాన పంటలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని హార్టికల్చర్ ఆఫీసర్ జి.విజయలక్ష్మి అన్నారు. సోమవారం తేటగుంట, తిమ్మాపురం, తదితర వరద ప్రాంత గ్రామాల్లో ఆమె పర్యటించి ఉద్యాన పంటలను పరిశీలించారు. మెట్ట ప్రాంతంలో తుపాను తీవ్రత పెద్దగా లేదన్నారు. ఈ వర్షాలు ఉద్యాన పంటలకు మేలు చేస్తాయన్నారు. మరింత అధికమైతే రైతులు అప్రమత్తమై సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా కురగాయలు, ఆకుకూరలు, పూల తోటల్లో నీటి నిల్వలేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఖరీఫ్ వరి పైర్లపైతుపాను ప్రభావంలేదని, అక్కడక్కడ కొంతమేరకు పత్తికి నష్టం వాటిల్లిందని ఏఓ అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మండలంలో 19.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయినట్టు తహసీల్దార్ పి.శివకుమార్ తెలిపారు.

తొండంగి: మండలంలోని ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మెట్ట ప్రాంతాల్లో 512 ఎకరాల్లో వరిపంట పనలపై తడిసిపోగా, 200 ఎకరాల్లో వరిపంట నేలకొరిగింది. ఈ పంటలను తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, ఏఓ ఎస్.నరసింహం ఇతర అధికారులు బృందం ఎ.కొత్తపల్లి, తొండంగి, శృంగవృక్షం తదితర ప్రాంతాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మండలంలోని తీరంలో అలలు ఉవ్వెత్తిన ఎగసిపడ్డాయి. తుపాను ప్రభావానికి దెబ్బతిన్న ప్రాంతాల్లో అధికార యంత్రాంగం సహాయక చర్యలు చేపట్టాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు గ్రామాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. తొండంగిలో కంట్రోల్ రూమ్ కొనసాగుతుందని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు.



సిరిపురంలో వర్షాలకు నేలకొరిగిన వరిపనలు

కోటనందూరు: తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి మండలంలో 440 ఎకరాల్లో కోసి పనలపై ఉన్న వరి పంట తడిచింది. బొద్దవరం, కోటనందూరు, ఇండుగపల్లి, జగన్నాథపురం, భీమవరపుకోట తదితర గ్రామాల్లో నీట మునిగిన, నేలకొరిగిన వరి పంటను వ్యవసాయాధికారి కేజే చంద్రశేఖర్, తహసీల్దార్ కుశరాజు పరిశీలించారు. పనలపై పంటను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ వర్షానికి తడిచిన పనలు మొలకెత్తకుండా లీటరు నీటికి 50 గ్రాముల కళ్లుప్పును కలిపి పనలపై పడే విధంగా పిచికారీ చేసుకోవాలన్నారు. నీళ్ల లేకపోతే పొలంలోనే పనలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని, నీరుంటే పనలను ఒడ్డుకు చేర్చి పిచికారీ చేయాలన్నారు. వర్షం తగ్గి ఎండ రాగానే పనలు తిరగేసి ఎండబెట్టి నూర్చుకుంటే పంటకు ఎటువంటి వాటిల్లదన్నారు. ఏఈఓ శివకుమారి, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

గోకవరంలో ఎడతెరిపిలేని వర్షం

గోకవరం: మండలంలో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాల కారణంగా గంగంపాలెం, తదితర గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. పలు గ్రామాల్లో మొక్కజొన్న పంట నీట మునిగింది. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేసి మిల్లులకు తరలించారు. మండలంలో పలు ఉద్యానవన పంటలను కోరుకొండ ఉద్యానవనశాఖ అధికారి పి.రిని పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

కిర్లంపూడి: మండలంలో వర్షానికి తడిసిన పంట పొలాలను ఏఓ జోకా అమృత ఆదేశాలతో మంగళవారం స్థానిక వీఏఏలు పొలాలను పరిశీలించారు.



లింగంపర్తిలో పంటలను పరిశీలిస్తున్న ఏఓ జ్యోతి



ఏలేశ్వరంలో నీటమునిగిన ప్రధాన రహదారి



ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడిలో ఇంటి ముంగిట కొచ్చిన వర్షం నీరు



వర్షానికి తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ



ఎస్.తిమ్మాపురంలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న వీఏఏ

రైతులకు నష్టం లేకుండా చేస్తాం



కాట్రావులపల్లి వద్ద ధాన్యం కొనుగోలును పరిశీలిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు



బాలాజీ రైసు మిల్లు వద్ద ధాన్యం లోడుతో ఉన్న ట్రాక్టర్లు

- పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు

జగ్గంపేట: తుపాను ప్రభావంతో కోతలు పూర్తి అయి కళ్లాల్లో ఉనఓన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించే పనులు చురుగ్గ సాగుతున్నాయని, రైతులకు ఎలాంటి నష్టం లేకుండా ధాన్యం తీసుకుంటున్నామని పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు తెలిపారు. మండలంలోని కాట్రావులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడ నుంచి జగ్గంపేట బాలాజీ రైసు మిల్లు వద్ద ధాన్యం తీసుకుంటున్న విధానాన్ని పరిశీలించారు. అక్కడ ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజుల్లో జగ్గంపేట మండలంలో 550 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జగ్గంపేటలో వున్న బాలాజీ రైసు మిల్లుతోపాటు అందుబాటులో వున్న మరికొన్ని మిల్లులకు పంపుతున్నామని చెప్పారు. ప్రభుత్వం ఏ ఒక్క రైతుకు నష్టం కలగకుండా చూడాలని ఆదేశించిందని, దానికి అనుగుణంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీదేవి, వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్, బాలాజీ రైసుమిల్లు అధినేత కొత్త భైరవకృష్ణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యం ఇవ్వటం లేదు

మండలంలోని రైతులు తుపాను ప్రభావంతో తడిసి 23 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని ఇవ్వడానికి రైతులు ముందుకు రావడం లేదని మండల వ్యవసాయ అధికారి రెడ్ల శ్రీరామ్ తెలిపారు. 23 శాతం తేమ ప్రకారం ధర కడితే తమకి నష్టం వస్తుందని, ధాన్యం తేమ శాతం తగ్గిన తరువాత అమ్మకొంటామని కొందరు రైతులు చెపుతున్నారని, అటువంటి వారు ధాన్యాన్ని కళ్లాల్లోనే ఉంచారని వివరించారు. సుమారు 200 టన్నుల వరకు ధాన్యం ఉటుందని తెలిపారు.

పార్కు స్థలాలు అధ్వానం

- ఇబ్బందులు పడుతున్న చిన్నారులు
- పట్టించుకోని అధికారులు

ఏలేశ్వరం: రోజంతా అలసిపోయి వచ్చిన వారికి కాసేపు ఉపశమనం పొందేందుకు పార్కులు ఎంతో గానో ఉపయోగపడతాయి. పిల్లల శరీరదారుఢ్యనికి ఆటస్థలాలు కీలకపాత్ర పోషిస్తాయి. పిల్లలతో పాటు వృద్ధులు సేదతీరడానికి పార్కులు ఎంతో దోహదపడతాయి. అలాంటి పార్కులు, వాటికి కేటాయించిన స్థలాలు నిరుపయోగంగా మారడంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



స్థానిక షిర్డీనగర్ గాంధీజీ విగ్రహం వద్ద తుప్పలు పెరిగిపోయిన పార్కు

పట్టణ పరిధిలోని సుమారు పదివరకు పార్కులు ఉండగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో ఆప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనల ప్రకారం పట్టణ పరిధిలోని పంటభూములను, ఖాళీ స్థలాలను లేఅవుట్లుగా మారిస్తే కొంత స్థలం పార్కుకు కేటాయించవల్సి ఉంటుంది. నగరపంచాయతీగా హోదా వచ్చిన నాటి నుంచి పట్టణంలో పలుచోట్ల లేలవుట్లు వేశారు. వీటి నిమిత్తం కేటాయించిన పార్కు స్థలాలు నిరుపయోగంగా మారాయి. దీంతో ఈ స్థలాలు కొన్ని చోట్ల ఆక్రమణలకు గురవుతుండగా మరికొన్ని చోట్ల తుప్పలు పేరుకుపోయాయి. స్థానిక షిర్డీనగర్ గాంధీజీ విగ్రహం వద్ద నిర్మించిన పార్కు తుప్పలు పెరిగిపోయాయి. దీంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాగా పార్కు నిర్మించి దాదాపు ఐదేళ్లు అవుతున్నా ఇప్పటివరకూ ప్రారంభం కాకపోవడం విశేషం.



షిర్డీనగర్‌లో నిరుపయోగంగా ఉన్న పార్కుస్థలం

నిరుపయోగంగా స్థలాలు

పట్టణంలో పార్కులుగా కేటాయించిన స్థలాలు నిరుపయోగంగా మారాయి. స్థానిక పెద్దవీధి, షిర్డీనగర్, షిర్డీనగర్ గాంధీజీ విగ్రహం, దిబ్బలపాలెం, తదితర ప్రాంతాల్లో పార్కులు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ప్రాంతాల్లో స్థలాలు ఉన్నాయి. నిర్వహణ లేక ఇవి ఆక్రమణలు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



పట్టణంలోని పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. పార్కుస్థలాలు అక్రమణలకు గురికాకుండా చూస్తాం. ప్రభుత్వం నిధులు కేటాయించి పార్కుల ఆధునీకీకరణకు చర్యలు చేపడతాం.

– కెశ్రీనివాసరావు, కమిషనర్, నగరపంచాయతీ ఏలేశ్వరం

సుడిగాలి బీభత్సం



గండేపల్లి సమీపంలో బంక్ ఎదురుగా హైవే పక్కన సుడిగాలి బీభత్సం



హైవేవర్ వద్ద సర్వీస్ సెంటర్ షెడ్డు పై కూలిన చెట్టు



ఎ.కొత్తపల్లిలో దెబ్బతిన ఇంటి పైకప్పు



గాలికి బోల్తా పడిన ఆటో

తొండంగి: మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలో మంగళవారం సాయంత్రం సుడిగాలి బీభత్సం సృష్టించింది. గాలులు అతి వేగంగా రావడంతో ఇంటి పైకప్పులు, వాహనాలు, దుకాణాలు ఎగిరిపడ్డాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. గోపాలపట్నం రైల్వే స్టేషన్ రోడ్డులో ఆటోలు, మినీ వ్యాన్ గాలి ప్రభావానికి బోల్తాపడ్డాయి. ఈ మేరకు తహసీల్దార్ జి.సుబ్రహ్మణ్యం, ఆర్ఐ వెంకటేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది ఎ.కొత్తపల్లిలో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. తాత్కాలిక పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు తెలిపారు.

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలో ..

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలో మంగళవారం సాయంత్రం సుడిగాలి బీభత్సం సృష్టించింది. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో పది నిమిషాల పాటు గాలి అతివేగంగా రావడంతో చెట్లు, రేకుల షెడ్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. హోర్డింగ్‌లు, బోర్డులు అన్ని గాలిలో ఎగిరాయి. అన్నవరం రైల్వేస్టేషన్ వద్ద మొదలైన సుడిగాలి సుమారు వంద కిలోమీటర్ల వేగంతో అన్నవరం వైపు దూసుకొచ్చింది. గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. రత్నగిరి కొండల మీదుగా పంపా నదికి చేరి అక్కడ సుడి తిరగడంతో నదిలో నీరు మేఘాలను తాకాయి. సుడిగాలి తాకిడికి రత్నగిరిపై చెట్లు నేలకూలాయి, రైల్వేస్టేషన్ రోడ్డులో ఫ్లెఓవర్ వద్ద సర్వీస్ సెంటర్ షెడ్డుపై చెట్టు కూలిపోవడంతో పలు పరికరాలు ధ్వంసమై సుమారు రూ.నాలుగు లక్షలు నష్టం వాటిల్లిందని ఆసెంటర్ యజమాని సుకుమార్ తెలిపారు.

గండేపల్లి: 16వ నెంబర్ జాతీయ రహదారిపై సుడిగాలి బీభత్సం సృష్టించింది. మండలంలోని గండేపల్లి శివారు రాజ్ చెరువు వద్ద గల పెట్రోల్ బంక్ ఎదురుగా గాలి అతివేగంగా రావడంతో చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. అరటి, కొబ్బరి చెట్లు విరిగిపడ్డాయి. సుడిగాలికి రాళ్లు పైకి లేచి పడడంతో హైవేపై ఉన్న వ్యాన్ స్వల్పంగా దెబ్బతింది. కారు అద్దాలు పగిలి ధ్వంసమయ్యాయి. వాహనదారులు భయపడ్డారు.

ఏలేశ్వరం: ఈదురుగాలులకు మండల వ్యాప్తంగా పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. దీంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఏలేశ్వరం నుంచి తిరుమాలి వెళ్లే ప్రధానరహదారిపై ఐదు భారీ చెట్లు నేలకొరిగాయి. దీంతో కాకినాడ వైపు వెళ్లే వాహనాలను లింగంపర్తి, సిరిపురం మీదుగా మళ్లించారు. కొద్ది గంట అనంతరం తహసీల్దార్ చిన్నారావు నేతృత్వంలో చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అలాగే అప్పన్నపాలెం వద్ద భారీవృక్షం కూలిపోగా పలు భవనాలు దెబ్బతిన్నాయి.



ఏలేశ్వరం నుంచి తిరుమాలి వెళ్లే రహదారిపై నేలకొరిగిన భారీవృక్షం



నేలకొరిగిన విద్యుత్‌స్తంభాలు



తొండంగి మండలం గోపాలపట్నం రైల్వేస్టేషన్ రోడ్డులో గాలి బీభత్సానికి బోల్తా పడిన వాహనాలు



రైల్వేస్టేషన్ రోడ్డులో విరిగి పడిన చెట్టు కొమ్మలు



సుడిగాలి కి అన్నవరంలో తిరగబడిన ఆటో, చిరువ్యాపారుల బండి